ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పేజీలు : 4 | సంపుటి : 01 | - సంచిక 200 | ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ | శనివారం 26- 10 - 2024 | వెల - 2

Digital Edition

## మూసీ నది సర్వనాశనానికి కాంగ్రెస్ పార్టీనే కారణం: బండి సంజయ్

మూసీ ప్రక్షాళన అంశంలో కాంగ్రెస్ ఐ బీజేపీ

మూసీ పరీవాహక ప్రాంతాల్లో మంత్రులు తిరగాలన్న బండి సంజయ్

సీఎం రేవంత్ రెడ్డి పొంతన లేకుండా మాట్లాడుతున్నారని ఆగ్రహం




మూసీ ప్రక్షాళన అంశంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా ఈ అంశంపై కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ స్పందించారు. మూసీ నది సర్వనాశనానికి కాంగ్రెస్ పార్టీనే కారణమని ఆరోపించారు. పరిశ్రమలకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చింది కాంగ్రెస్సేనని మండిపడ్డారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో మంత్రులు తిరగాలని బండి సంజయ్ స్పష్టం చేశారు.

మూసీ అంశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పొంతన లేకుండా మాట్లాడుతున్నారని, మూసీ సుందరీకరణా? లేక, పునరుజ్జీవమా? అనేదానిపై స్పష్టత లేదన్నారు. గతంలో లక్షన్నర కోట్లు ఖర్చు అన్నారు... ఇప్పుడు ఆ మాట అనలేదంటున్నారు అంటూ బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన పేదల కోసం కాదని విమర్శించారు. ఆరు గ్యారెంటీలను డైవర్ట్ చేసేందుకే హైడ్రా పేరిట డ్రామా ఆడుతున్నారని ధ్వజమెత్తారు.



## అమ్మకు వందనం కల..
## నాన్నకు ఇంధనం భళా..!

పాణ్యం అక్టోబరు (రిపబ్లిక్ న్యూస్):

కూటమి ప్రభుత్వంలో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు తప్పని ఫీజుల మోత
గత ఏడాదిగా తల్లిదండ్రులకు అందని ప్రభుత్వ విద్య ప్రయోజనము
వచ్చే ఏడాది లోనైనా అమ్మకు వందనం కల ఫలించేనా..

2లో

## రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలిచేలా పనిచేయాలి సీఎం చంద్రబాబు

త్వరలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు

ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాల నేతలతో చంద్రబాబు భేటీ

టెలీకాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం

2లో




ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నేడు నాలుగు జిల్లాల టీడీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో... ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల టీడీపీ నేతలకు దిశానిర్దేశం చేశారు. తూర్పుగోదావరి-పశ్చిమ గోదావరి...

## ఈ దీపావళి నుంచే ఉచిత గ్యాస్ సిలిండర్లు... విధివిధానాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల

రాష్ట్రంలోని అర్హులందరికీ ఉచితంగా గ్యాస్ సిలిండర్లు

ఎన్నికల హామీని నిలబెట్టుకుంటున్నామన్న మంత్రి నాదెండ్ల

ఎల్.పి.జి.కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు అర్హతగా పథకం అమలు



రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఈ దీపావళి నుంచే మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. అందుకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయడం జరిగిందని, సంబంధిత మార్గదర్శకాలను, విధి విధానాలను నిర్దేశిస్తూ ఇవాళే ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేస్తున్నట్టు తెలిపారు. సచివాలయం నాలుగో బ్లాక్ ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో మాట్లాడారు.

-మిగతా4లో

## చీరకొంగులో చిట్టీలు..
## గ్రూప్ 1 మెయిన్స్‌లో మహిళ కాపీయింగ్..



తెలంగాణలో 563 గ్రూప్-1 పోస్టులభర్తీకి సోమవారం మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించారు. నాలుగో రోజు ఎకానమీ అండ్ డెవలప్మెంట్ ఎగ్జామ్‌లో ఓ అభ్యర్థిని కాపీయింగ్ చేస్తూ అడ్డంగా దొరికిపోయింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని సీవీఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగింది. చాలా మంది విద్యార్థులు పదోతరగతి, ఇంటర్, డిగ్రీలో పరీక్షలు రాసే సమయంలో చిట్టీలు తీసుకొచ్చి కాపీ కొడుతుంటారు. అలా పరీక్షల్లో కాపీ కొట్టే సమయంలో ఒక్కోసారి దొరికిపోతుంటారు. దీంతో వెంటనే ఇన్విజిలేటర్ వారిని పరీక్ష రాయకుండా డిబార్ చేయడం వంటివి మనం చూసే ఉంటాం. అయితే ఇప్పుడు కూడా అలాంటిదే జరిగింది. ఆ కాపీయింగ్ ఇంటర్, డిగ్రీలో కాదు.. గ్రూప్ 1 ఎగ్జామ్‌లో జరిగింది.

563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఎగ్జామ్

2లో

తెలంగాణ రిపబ్లిక్ న్యూస్

## చీమకుర్తి కూరగాయల మార్కెట్‌కు మోక్షం

ఏడేళ్లుగా నిరుపయోగంగా మారిన వైనం
13షాపులకు 28న వేలం
ఈసారైనా దుకాణాలు తెరుచుకొనేనా..



**చీమకుర్తి, అక్టోబరు 25** : చీమకుర్తి పట్ట ణంలో దాతల సహకారంతో నిర్మించిన కూరగాయల మార్కెట్‌కు ఎట్టకేలకు మోక్షం కలగనుంది. గత ఏడేళ్లుగా నిరుపయోగంగా మూతపడి ఉన్న మార్కెట్ నిర్వహణకు ఎట్టకేలకు మార్గం సుగమం అయింది. అందులోని 13షా పులకు ఈనెల 28వ తేదీన ఉదయం 11.30లకు స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేలం నిర్వహించను న్నట్లు కమిషనర్ వై.శివరామకృష్ణయ్య శుక్రవారం ఒక ప్ర కటనలో తెలిపారు. రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి, మాజేటి హనుమాన్‌ల ఆధ్వర్యంలో నిర్మించిన మాజేటి సువర్చలా దేవి కూరగాయల మార్కెట్‌ను గతంలో టీడీపీ ప్రభు త్వం అధికారంలో ఉన్నపుడు అప్పటి మంత్రి శిద్దా రాఘ వరావు చేతులమీదుగా ప్రారంభోత్సవం నిర్వహించారు. తర్వాత ఒకసారి షాపులకు వేలం నిర్వహించగా బాగానే స్పందన వచ్చింది. కానీ షాపులను వేలంలో దక్కించుకు న్న వారు మార్కెట్‌లో అమ్మకాలను సాగించకుండా పట్ట ణంలోని వివిధ ప్రాంతాల్లో అనువుగా ఉన్నచోట వ్యాపా రం చేసుకున్నారు. దీంతో మార్కెట్‌లో షాపులు తెరుచు కోలేదు. అప్పటి వైసీపీ ప్రభుత్వం హయాంలో వేలం ని ర్వహణ జోలికి పోలేదు. దీంతో అసలే ఆదాయ వనరులు లేని మున్సిపాలిటీలో ఆదాయం వచ్చే కూరగాయల మా ర్కెట్ నిర్వహణ కూడా మూలనపడటంతో నిధులకు క టకటలాడాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం రావటం, నూతన కమిషనర్ బాధ్యతలు చేపట్టిన తర్వాత కూరగా యలమార్కెట్‌ను తెరిపించాలనే విషయంపై దృష్టి సా రించారు. కాగా వేలంలో షాపులు దక్కించుకున్నవారు మార్కెట్‌లోనే వ్యాపారాలను నిర్వహించటం అనేది అధి కారులకు సవాల్‌గా మారనుంది. అందరం రూ.లక్షలు వె చ్చించి వేలంలో దక్కించుకున్న తర్వాత వ్యాపారం ఇక్క డే నిర్వహించాలంటే వారికి ఒక సమస్య వేధిస్తుంది. వే లం ముగిసిన తర్వాత నిబంధనలు మేరకు పట్టణంలో మార్కెట్లో తప్ప మరోచోట కూరగాయలు విక్రయించ టానికి వీలులేదు. కానీ ఈ నిబంధనలు అమలు చేయ టం ప్రాక్టికల్‌గా అధికారులకు కష్టసాధ్యం అవుతుంది. మరో చోట షాపులు పెట్టకుండా నివారించకలిగినా తోపు డు బండ్లు మీద కూరగాయల విక్రయాలు సాగించే వా రిని అమ్మకాలు సాగించకుండా నిలువరించటం అంత తేలికగా జరగదు. దీంతో రూ.లక్షలు వెచ్చించి షాపులు దక్కించుకొని ఇపుడు ఎంతో ఆదాయం లభిస్తున్న చోటు ను వదలి మార్కెట్‌లో షాపు పెడితే తమకు ఎంతవరకు గిట్టుబాటు అవుతుందనే ఆలోచనలో ప్రస్తుతం కూరగా యల వ్యాపారాన్ని వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్నవారు ఉన్నారు.

## రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు గెలిచేలా పనిచేయాలి సీఎం చంద్రబాబు

కృష్ణా జిల్లా-గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాలని టీడీపీ నేతలకు సూచించారు.

గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు నవంబరు 6వ తేదీ లోపు పూర్తిచేయాలని చంద్రబాబు స్పష్టం చేశారు. ప్రతి పట్టభద్రుడు ఓటు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కష్టపడి పనిచేస్తున్న అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులు గెలిచేలా చూడాలని పేర్కొన్నారు. జనసేన, బీజేపీ శ్రేణులను కూడా కలుపుకుని సమన్వయంతో ముందుకెళ్లాలని నిర్దేశించారు.

అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలబెట్టాలని, 2029 ఎన్నికల్లోనూ ఎన్డీయే గెలుపే లక్ష్యంగా ఇప్పటినుంచే కృషి చేయాలని చంద్రబాబు సూచించారు. మండలాల వారీగా ఎన్డీయే సమన్వయ కమిటీలు పెట్టాలని అన్నారు. ప్రతి చోట మూడు పార్టీల నేతలతో సమన్వయ భేటీలు నిర్వహించాలని తెలిపారు.

## చీరకొంగులో చిట్టీలు..

## గ్రూప్ 1 మెయిన్స్‌లో మహిళ కాపీయింగ్..

రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి సోమవారం మెయిన్స్ ఎగ్జామ్ నిర్వహించారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 46 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. ఈ మెయిన్స్ ఎగ్జామ్స్‌కి మొదటి రోజు మొత్తం 31,403 మందికి గానూ 22,750 మంది హాజరయ్యారు.ఈ ఎగ్జామ్స్ అక్టోబర్ 22 నుంచి అక్టోబర్ 27 వరకు కొనసాగనున్నాయి. ఇందులో భాగంగానే ఈ పరీక్షలు మొదలై మూడు రోజులు సజావుగా సాగిపోయాయి. కానీ నాలుగో రోజు మాత్రం అనుకోని సంఘటన జరిగింది.

## జోగులాంబ ఆలయంలో వసతుల నిర్వహణకు వేలం..

అలంపూర్ పల్లె వెలుగు న్యూస్ :



జోగులాంబ గద్వాల్ జిల్లాలోని అలంపూర్‌లో ఉన్న శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానంలో ఇవాళ (శుక్రవారం) కీలక ప్రక్రియ ముగిసింది. ఆలయానికి సంబంధించిన టెంకాయలు, వసతి గృహాల నిర్వహణ, మరుగుదొడ్ల నిర్వహణ, షాపులకు, పార్కింగ్ స్థలాల నిర్వహణకు సంబంధి వేలంపాట ప్రక్రియ జరిగింది. హెూరాహెూరీగా సాగిన వేలంలో సరికొత్త రికార్డులు నమోదయ్యాయి.

టెంకాయల ( పూజా సామాగ్రి) వేలం రికార్డ్ స్థాయిలో జరిగింది. గతంలో కంటే రెట్టింపు ధర పలికింది. పూజా సామాగ్రి వేలం ఈసారి ఏకంగా రూ.1.27 కోట్లు పలికింది. మొత్తం అన్ని వసతుల నిర్వహణ వేలం ద్వారా ఆలయానికి మొత్తం రూ.3.48 కోట్ల ఆదాయం లభించింది.

కాగా శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి దేవస్థానం.. జోగులాంబ గద్వాల్ జిల్లాలోని అలంపూర్‌లో ఉంది. రోడ్డు మార్గంలో హైదరాబాద్ నుంచి అలంపూర్ దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉంది. హైదరాబాద్-బెంగళూరు హైవే ద్వారా చేరుకోవచ్చు.

## నేటి నుంచి సభ్యత్వ నమోదు

**ఒంగోలులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, వేదికపై టీడీపీ ముఖ్య నేతలు**

**ప్రతి నలుగురు ఓటర్లలో ఒకరిని టీడీపీలో సభ్యుడిగా చేర్పించడమే లక్ష్యం**

**సాంకేతిక పరిజ్ఞానం వినియోగం**

**శాశ్వత సభ్యత్వంపైనా దృష్టి**

ఒంగోలు, అక్టోబరు 25 : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు శనివారం నుంచి ప్రారంభంకానుంది. ఈసారి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆపార్టీ తదనుగుణ చర్యలు చేపట్టింది. నియోజకవర్గం యూనిట్‌గా ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిల పర్యవేక్షణలో ప్రక్రియ సాగేలా ఆదేశించింది. ప్రతి నలుగురు ఓటర్లలో కనీసం ఒకరు పార్టీ సభ్యులుగా నమోదయ్యేలా చూడాలని అధిష్ఠానం దిశానిర్దేశం చేసింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో రెండు లక్షల నుంచి రెండున్నర లక్షల మంది ఓటర్లు ఉన్నారు. అంటే ఒక్కో నియోజకవర్గంలో 50 వేల నుంచి 60వేలమందిని సభ్యులుగా చేర్పించాల్సి ఉంటుంది. పార్టీ సభ్యత్వ రుసుం ఒక్కొక్కరికి వంద రూపాయలు కాగా సభ్యత్వం పొందిన పార్టీ కార్యకర్తల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేయనుంది. గతంలో రెండు లక్షల ప్రమాద బీమా సౌకర్యం ఉండగా దానిని ప్రస్తుతం రూ.5 లక్షలకు పెంచారు. అలాగే పార్టీ సభ్యత్వం ఉన్న కుటుంబ సభ్యులలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు, అనారోగ్య సమస్యల పరిష్కారానికి తోడ్పాటు ఇవ్వనున్నారు. ఇలాంటి సంక్షేమ పథకాలపై కూడా కార్యకర్తలకు అవగాహన కల్పించాలని అధిష్ఠానం సూచించింది. మరోవైపు ఈసారి శాశ్వత సభ్యత్వం ఇచ్చేలా ఏర్పాటు చేశారు. సభ్యత్వ రుసుం కింద రూ.లక్ష చెల్లించే వారిని శాశ్వత సభ్యులుగా పరిగణిస్తారు. అధిష్ఠానం సూచనలతో జిల్లాలో శనివారం నుంచి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టేందుకు అన్ని ప్రాంతాల నేతలు సన్నాహాలు చేస్తున్నారు. పలు చోట్ల నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఒంగోలు నియోజకవర్గస్థాయి సమావేశం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఆధ్వర్యంలో జరిగింది. నగరంలోని వార్డుల వారీ, రూరల్ ప్రాంతంలో గ్రామాల వారీ సభ్యత్వ చేర్పింపు లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. అలాగే దర్శి నియోజకవర్గంలో ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి నేతృత్వంలో సమావేశం జరిగింది. ఇతర చోట్ల కూడా ఇలాంటి సమావేశాలు నిర్వహించారు. సభ్యత్వ నమోదు డిజిటల్ రూపంలో చేయనున్నారు. ఫోన్, టెలిగ్రాం యాప్‌లో, ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లోనూ నమోదు చేసేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం ఏర్పడటం తదితర సానుకూల పరిస్థితులలో పూర్తి జోష్ మీద ఉన్నటీ డీపీ శ్రేణులు పెద్దఎత్తున సభ్యత్వం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# అమ్మకు వందనం కల.. నాన్నకు ఇంధనం భళా..!

టిడిపి ,బిజెపి, జనసేన, మూడు పార్టీలు కలసి 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజయభేరి మోగించి ప్రభుత్వాన్ని కూటమి ప్రభుత్వంగా ఏర్పాటు చేశాయి. టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వానికి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. భారతదేశం మొత్తం మీద ఏడు దఫాలుగా ఎన్నికలు నిర్వహించారు. మే 13న ఆంధ్రప్రదేశ్లో ఎన్నికలు నిర్వహించగా జూన్ 4న ఎన్నికల ఫలితాలు ప్రకటించారు. జూన్ 12న కూటమి ప్రభుత్వం కొలువుదిరింది .అక్టోబర్ 23 నాటికి 150 రోజుల కాలమైంది. అయితే సూపర్ సిక్స్ పథకాలతో అన్నా క్యాంటీన్లు, దీపావళికి ఉచిత గ్యాస్, అంటున్నారు అందులో అన్న క్యాంటీన్లు మాత్రం కార్యాచరణకు నోచుకున్నాయి .ఇంకా మిగిలిన పథకాలు ఎప్పుడు వస్తాయని ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారు. అయితే సమాజానికి అత్యంత ప్రాధాన్యత కలిగినటువంటి అంశం విద్య గత ప్రభుత్వంలో అమ్మఒడి పేరుతో పాఠశాలకు వెళ్లే ప్రతి ఇంటిలో ఒక విద్యార్థికి రూ 15,000 చొప్పున చెల్లిస్తామని ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు ఈ పథకాన్ని కొనసాగించింది. 2024లో సార్వత్రిక ఎన్నికల సమరంలో ప్రతిపక్ష పార్టీలైన టిడిపి, బిజెపి, జనసేన లు ప్రత్యక్షంగా ఈ యొక్క పథకానికి పేరు మార్చి అమ్మకు వందనం పేరుతో ప్రతి కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉన్నా ప్రతి ఒక్కరికి కూడ రూ 15,000 నగదు చెల్లిస్తామని ఢంకా భజాయించారు. అయితే ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటినుండి తుఫానులు, వరదలు, విపరీతంగా రావడంతో ప్రజాపాలన అస్తవ్యస్తంగా మారింది. విజయవాడ బుడమేరు కోపానికి గురైంది. దీంతో పరిపాలన పై కాస్త పట్టు సన్నగిల్లింది. వరదలతో పట్టణం మొత్తం పూర్తిగా చెల్లాచెదురు కావడంతో ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు, వారికి పునరావాస సౌకర్యం కల్పించేందుకు పూర్తిగా నిమగ్నమయ్యారు. అయితే పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు మాత్రం అమ్మకు వందనం కలగా మారిందని, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులు మాత్రం ఎంతో కొంత ఆసరాగా ఉంటుందనుకున్న అమ్మకు వందనం సాయం రాకపోవడంతో తల్లిదండ్రులు లబోదిబో మంటున్నారు. ఫీజు చెల్లించకపోతే పరీక్షలు రాయనివ్వమని ,ఇళ్లకు పంపించిన సంఘటనలు కోకోల్ల లుగా ఉన్నాయి.

### ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు నిరాశ

నియోజకవర్గంలోని పాణ్యం, ఓర్వకల్లు, గడివేముల ,మండలాలలో 132 ప్రభుత్వ పాఠశాలల్లో 14,607 మంది విద్యార్థులు, 42 ప్రైవేట్ పాఠశాలల్లో 12,374 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే గత ఏడాది, ఈ ఏడాది కూడా ఈ విద్యార్థులకు అమ్మకు వందనం విద్యాప్రయోజనం కలగలేదని చెప్పాలి. మొత్తం మీద ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రైవేట్ పాఠశాలల్లో దాదాపుగా 10% తేడాతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల మోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తల్లిదండ్రుల నుండి పుస్తకాలు, దుస్తులు, విద్యాసామాగ్రి, తదితర అంశాల పేరుతో వేలకు వేల రూపాయలు గుంజుతున్నారు. అయితే పాఠశాల ఫీజులో కాస్త ప్రభుత్వం నుంచి ఆసరాగా వస్తుందనుకున్న నగదు రానందుకు తల్లిదండ్రులకు నిరాశ ఎదురవుతోంది. పాణ్యం మండలంలో 46 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా అందులో 4,818 మంది విద్యార్థులు, 11 ప్రైవేట్ పాఠశాలల్లో 5,935 మంది విద్యార్థులు, ఓర్వకల్లు మండలంలో 48 ప్రభుత్వ పాఠశాలల్లో 6,329 మంది విద్యార్థులు, 21 ప్రైవేట్ పాఠశాలల్లో 3,918 మంది విద్యార్థులు, గడివేముల మండలంలో 38 ప్రభుత్వ



పాఠశాలల్లో 3,390 మంది విద్యార్థులు,10 ప్రైవేట్ పాఠశాలల్లో 2,461 మంది విద్యార్థులు చదువుతున్నారు.

### నాన్నకు ఇంధనం భళా..

అమ్మకు వందనం పథకం ఏమో కానీ, నాన్నకు మాత్రం ఇంధనం సంపూర్ణంగా అమలు జరుగుతోంది . అది కూడా ప్రభుత్వ మద్యం షాపులను పూర్తిగా రద్దుచేసి, వ్యక్తిగతంగా లైసెన్సుల ద్వారా ప్రైవేట్ వ్యక్తులకు మద్యం దుకాణాలను ఈ ప్రభుత్వంలో అప్పజెప్పారు. ఈనెల 16వ తేదీ నుండి మద్యం షాపులు అమలులోకి వచ్చాయి. పాణ్యం, గడివేముల, ఓర్వకల్లు, మండలాలలో 6 మద్యం షాపులు ప్రారంభమయ్యాయి. నాణ్యమైన మద్యం అందిస్తున్నారు కానీ, ధరల తగ్గుదలలో ఏమాత్రం ప్రభుత్వం ముందడుగు వేయలేదు. ఎన్నికల హామీలలో గంభీరంగా ధరలు తగ్గించి నాణ్యమైన మద్యం సరఫరా చేస్తామన్న మాటలు మందుబాబులకు ఇప్పుడు ఏమాత్రం రుచించడం లేదు. మద్యం సరఫరా లో శ్రద్ధ చూపించిన ప్రభుత్వం విద్యార్థుల సదువుపై, వారి భవిష్యత్తుపై , కాస్త శ్రద్ధ చూపిస్తే కన్న పేగులకు ఫీజుల్లో కాస్త సాయం అందుతుందని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

# 'లడ్కీ బహిన్' గెలుపు గుర్రమేనా?









వచ్చే నెల 20న మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలు జరగనున్నాయి. ఆ రాష్ట్ర ప్రజలే కాదు, యావద్దేశ జనులూ ఆ ఎన్నికల ఫలితాలు ఎలా ఉండనున్నాయనే ఉత్కంఠతో ఉన్నారు. ఇప్పుడు మహారాష్ట్రలోను, విశాల భాతదేశంలోను ప్రజల పిచ్చాపాటీలో రెండు మాటలు ప్రధానంగా వినపడుతున్నాయి. అవి: 'లడ్కీ బహిన్'. అది ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వం సరికొత్తగా అమలుపరుస్తున్న 'సంక్షేమ' పథకం. దాని కింద సంవత్సరాదాయం రూ. రెండున్నర లక్షల కంటే తక్కువగా ఉన్న ప్రతి కుటుంబానికి నెలా నెలా ఆ కుటుంబ గృహిణికి రూ.1500 బ్యాంకు ఖాతాలో జమ చేస్తారు. ఇప్పుడు ఈ ఉదార ఆర్థిక హాయమే చర్చనీయాంశంగా ఉన్నది. అయితే అది ఒక నిర్ణాయకమైన రాజకీయ ప్రశ్నను కూడా లేవనెత్తుతున్నది: గత ఆగస్టు నుంచి రెండు కోట్ల మందికి పైగా మహిళల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్న డబ్బు పాలక మహాయుతి కూటమి ప్రభుత్వంపై ప్రబలంగా ఉన్న ప్రజా వ్యతిరేకతను తొలగించగలదా?

రాష్ట్రాలలో గానివ్వండి లేదా కేంద్రంలో గానివ్వండి అధికారంలో ఉన్న ఏ పార్టీ ప్రభుత్వమైనా ఎన్నికల ముందు నిర్దిష్ట సామాజిక సమూహాలకు నగదు సహాయం పేరిట లంచాలు ఇవ్వడం ఇదే మొదటిసారి కాదు. అయితే ఇందుకు ముందెన్నడూ ఇంత హఠాత్తుగా, నిస్సిగ్గుగా, ఆర్థిక పర్యవసానాలను పట్టించుకోకుండా ఓటర్లకు ప్రత్యక్ష నగదు చెల్లింపులు చేయడం జరగలేదు. నవంబర్ 20న తమ ఓటు వేసేనాటికి లడ్కీ బహిన్ లబ్ధిదారులు అయిన మహిళల బ్యాంకు ఖాతాల్లో దీపావళి బోనస్ (ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి రాకముందు చివరి నిమిషంలో ప్రకటించారు)తో సహా రూ.7500 జమ అవుతాయి. ఈ ఉదార ఆర్థిక సహాయం అందించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం నెలసరిన ఇంచుమించు రూ.3700 కోట్లు వెచ్చించనున్నది. వార్షికంగా రూ.46 వేల కోట్ల భారం ఆ రాష్ట్ర ప్రభుత్వంపై పడనున్నది. మరి మహారాష్ట్ర ప్రభుత్వ రుణ భారం ఇప్పటికే రూ.7.8 లక్షల కోట్లుగా ఉన్నదని అంచనా ఎన్నికల ముందు మహాయుతి ప్రభుత్వ 'టిజోరి ఖోలో' (ప్రభుత్వ ఖజానాను తెరువడం) రాజకీయాల మూలంగా ఆ రుణ భారం మరింతగా పెరగనున్నదని సీనియర్ బ్యూరాక్రాట్ ఒకరు అన్నారు.

లడ్కీ బహిన్ యోజనను మూడు విధాలుగా చూడవచ్చు. ఒకటి%-% ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అగాఢీని చిత్తుచేసేందుకు ఉద్దేశించిన తెలివైన రాజకీయం. 2024 లోక్‌సభ ఎన్నికలలో పాలక మహాయుతి కూటమి రాష్ట్రంలోని 48 సీట్లలో కేవలం 17ను మాత్రమే గెలుచుకోగలిగింది. ఈ కారణంగా కీలక ఓటర్ల బృందాలను ఆకట్టుకోవడానికై కొత్త మార్గాలను అనుసరించేందుకు ఏక్‌నాథ్ షిండే ప్రభుత్వానికి అనివార్యమయింది. మహిళలు, యువత లక్ష్మిత ఓటు బ్యాంకులు కదా. మహిళలకు లడ్కీ బహిన్ పేరిట నేరుగా నగదు సహాయం అందించేందుకు, ఆర్థిక తోడ్పాటు అవసరమైన నిరుద్యోగ యువతకు 'లడ్కా భావు' పేరిట నగదు సహాయం చేసేందుకు షిండే సర్కార్ నిర్ణయించింది. లోక్‌సభ ఎన్నికలలో ప్రతిపక్ష ఇండియా కూటమి 'సంవిధాన్ ఖత్రే మే హై' (ప్రమాదంలో రాజ్యాంగం) అనే నినాదంతో గణనీయమైన విజయాలు సాధించగా ఇప్పుడు షిండే ప్రభుత్వం నగదు ఆధారిత పథకాలను శాసనసభ ఎన్నికల ప్రధాన ప్రచారాంశంగా చేయడంలో కనీసం తాత్కాలికంగా సఫలమయింది.

పై దృక్కోణానికి ప్రత్యామ్నాయంగా లడ్కీ బహిన్‌ను పూర్తిగా అనైతిక పద్ధతులలోనైనా సరే అధికారాన్ని కైవసం చేసుకోవడమే ధ్యేయమైన క్షుద్ర రాజకీయాలకు చిహ్నంగా చూసితీరాలి. ఇదే అందరినీ అమితంగా వ్యాకులపరుస్తున్న పరిణామం. గత ఐదేళ్లుగా మహారాష్ట్ర దేశంలోనే ఎక్కడా లేని రీతిలో రాజకీయ అస్థిరత్వంతో కుదేలైపోతోంది. ఈ ఐదేళ్లలో మూడు ప్రభుత్వాలు మారాయి. ఒక ముఖ్యమంత్రిని తెల్లవారుజామున గుట్టు చప్పుడు కాకుండా ప్రమాణ స్వీకారం చేయించారు. రెండు ప్రాంతీయ పార్టీలు చీలిపోయాయి. ధనరాశుల, మంత్రి పదవుల ప్రలోభంతో ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారు. భారత రాజకీయాల సంపూర్ణ నైతిక పతనానికి మహారాష్ట్ర అద్దం పట్టింది. 'వాషింగ్ మెషీన్', 'ఖోఖె చి సర్కార్' (ఒక 'ఖోఖా' ఒక కోటికి సమానం) అనేవి ఇప్పుడు మహారాష్ట్రీయుల రాజకీయ పరిభాషలో అంతర్భాగంగా ఉన్నాయి. ధన బలం, రహస్య బేరసారాలు, ఒప్పందాలు రాష్ట్ర రాజకీయాలను పూర్తిగా భ్రష్టపరిచాయి. భావజాలం ఏదైతేనేమి రాష్ట్ర శాసనసభ్యులలో మూడోవంతు మంది గత 15 ఏళ్లలో ఒకటి కంటే ఎక్కువ పార్టీలలో ఉన్నవారే!

లడ్కీ బహిన్ లాంటి నగదు సహాయం పథకాలను స్పర్థాత్మక 'రేవడి' రాజకీయాలుగా చూడడం మూడో దృక్కోణం (ఇదే చాలా తార్కికమైనది). ఇవి, ఆర్థిక వ్యవస్థకు తీవ్ర హానికరమైనవి అనవచ్చు. అనడమేమిటి, అలా నిరూపితమయ్యాయి కూడా. 2022లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉచితాల సంస్కృతికి వ్యతిరేకంగా ఓటర్లను హెచ్చరించారు. రాజకీయ పార్టీలు వాగ్దానం చేస్తున్న ఉచితాలు దేశ ఆర్థిక వ్యవస్థకు చాలా ప్రమాదకరమైనవి అని ఆయన స్పష్టం చేశారు 'రేవడి' సంస్కృతిని పెంచుతున్నవారు ప్రజలకు ఉచిత కానుకలు పంపిణీ చేయడం ద్వారా వారిని తమ స్వప్రయోజనాలకు కొనుగోలు చేసుకోవచ్చని విశ్వసిస్తున్నారని మోదీ గర్హించారు. 'మనమందరమూ సమైక్యంగా ఇటువంటి ఆలోచనలను అరికట్టాలి. దేశ రాజకీయాల నుంచి రేవడి సంస్కృతిని తొలగించాల్సిన అవసరం జరూరుగా ఉందని' ప్రధాన మంత్రి ఘోషించారు.

అదే సందర్భంలో కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నగదు హామీలను, ఢిల్లీ, పంజాబ్ లలో ఉచిత విద్యుత్తు, నీరు సమకూరుస్తామని ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన హామీలను ప్రధానమంత్రి తీవ్రంగా విమర్శించారు. రెండు సంవత్సరాలు గడిచేసరికి ఇప్పుడు మహారాష్ట్రలో పాలక కూటమిలో ఉన్న బీజేపీ లడ్కీ బహిన్ పథకానికి చొరవ తీసుకున్నది తామేనని గొప్పగా చాటుకుంటోంది. దాని ద్వారా అందే నగదు సహాయం మహారాష్ట్ర మహిళలకు ఆర్థిక సాధికారత సమకూరుస్తుందని బీజేపీ శ్రేణులు వాదిస్తున్నాయి. ఓటర్లకు లంచాలు ఇవ్వడం, వారికి సాధికారత కల్పించడం మధ్య ఉన్న విభజన రేఖ చాలా పలుచన. ముఖ్యంగా ఒకటి రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అటువంటి పథకాలను ప్రవేశ పెడుతున్న రాజకీయ పార్టీలకు ప్రజలకు ఆర్థిక సాధికారత కల్పించడంలో చిత్తశుద్ధి ఉన్నదని భావించగలమా?

నగదు ఆధారిత సంక్షేమ పథకాలకు ముఖ్యంగా మహిళా ఓటర్లు ఒక కీలక ఓటు బ్యాంకుగా ఉన్నారు. 2023లో మధ్యప్రదేశ్‌లో శివరాజ్ చౌహాన్ తన లడ్లీ బెహనా పథకంతో బీజేపీకి విజయం సాధించారు. ఇప్పుడు మహారాష్ట్రలోని మహాయుతి కూటమి ప్రభుత్వం కూడా అదే విధంగా నగదు ప్రయోజనాలను అందిస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టోలో దేశ వ్యాప్తంగా ప్రతి పేద మహిళ బ్యాంకు ఖాతాలో ఏడాదికి రూ. ఒక లక్ష జమ చేస్తామని కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసింది. 'మీరు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారైతే ప్రతి సంవత్సరమూ మీకు రూ. ఒక లక్ష 'ఖటాకట్ ఖటాఖట్ ఆతా రహేగా' అని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అభయమిచ్చారు.

రాహుల్ గాంధీ 'ఖటాఖట్' హామీలు బాధ్యతారాహిత్యానికి పరాకాష్ఠ అని బీజేపీ దుయ్యబట్టింది. ఆయన హామీలు అవాస్తవికమైనవని అధిక్షేపించింది. మరి అదే బీజేపీ, ఇప్పుడు షిండే సర్కార్ 'ఫటా ఫట్' నగదు బదిలీని ఒక 'రాజకీయ గేమ్ ఛేంజర్'గా అభినందిస్తోంది. ఎంత నయవంచన! ఉచితాల సంస్కృతి సామాజిక%-%ఆర్థిక పర్యవసానాలు ప్రశ్నించదగినవి. కార్పొరేట్ కంపెనీల వేల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలను రద్దు చేస్తున్న ప్రభుత్వం అన్నదాతలు అయిన రైతుల పంట రుణాలను మాఫీ చేసేందుకు వెనుకాడడమేమిటి? కష్టకాలంలో పేద మహిళలకు ఆదాయ మద్దతు సమకూర్చడంలో తప్పేమిటి? అసలు సమస్యేమిటంటే ప్రభుత్వ ప్రాథమ్యాలు సరైన విధంగా లేకపోవడమే. నిజమేమిటంటే మహారాష్ట్రలో నగదు సహాయ పథకాన్ని సుపరిపాలన లోటుకు నష్టపరిహారంగా ఉద్దేశించారన్నది ఒక చేదు సత్యం. ఐదేళ్లుగా అధికారంలో ఉన్న ప్రభుత్వాలు విద్యా ప్రమాణాలు, ఆరోగ్యభద్రతా సదుపాయాలను మెరుగుపరిచేందుకు నిధులు సక్రమంగా వినియోగించకుండా ప్రజల వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వాలు గెలవ కష్టసాధ్యమైన ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రత్యక్ష నగదు ప్రయోజనాలను సమకూర్చేందుకు సిద్ధమవుతున్నాయి. నెరవేర్చని హామీలకు గాను ఇటువంటి లబ్ధిని కల్పించి ఎన్నికలలో గెలిచేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇదెలాంటి సుపరిపాలన?

ఓటర్లు సైతం పోటీ చేస్తున్న అభ్యర్థులతో, (వారి నుంచి మరింత ఆర్థిక లబ్ధి పొందేందుకు) బేరసారాలు చేయడంలో అంతకంతకూ ఆరితేరిపోతున్నారు. ఒక నిర్దిష్ట పార్టీ అభ్యర్థి గెలిచిన అనంతరం తన పార్టీకి విధేయంగా ఉంటాడనే నమ్మకం లేనప్పుడు ఓటర్లు ఆ నేతకు ఓటు వేయాల్సిన అగత్యమేమిటి? అంతకంటే ఎవరు ఎక్కువ డబ్బు ఇస్తే వారికే ఓటు వేయడం మేలు కదా అనే ఆలోచనలో ఓటర్లు ఉన్నారు.

ముంబై మురికివాడ నివాసి (లడ్కీ బహిన్ లబ్ధిదారు) అయిన ఒక మహిళ నిర్మొహమాటంగా నాతో ఇలా అన్నారు: 'నేను ఎవరికి ఓటు వేసినా, అధికారంలోకి ఎవరు వచ్చినా ఏ ప్రభుత్వమూ ఇప్పుడు లడ్కీ బహిన్ పథకాన్ని ఆపలేదు'. ఇటువంటి ఓటర్లు జిత్తులమారి స్వభావం గలవారని నేతలు అనుకోవచ్చుగాక! మరి ఓటర్లు ఒక ఆకు ఎక్కువే చదివినవారే కాదూ? అంతిమంగా నేతలను వారు తప్పక కంగుతినిపిస్తారు, సందేహం లేదు.

## పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పోలీసు సిబ్బందికి వ్యాస రచన, వక్తృత్వ పోటీలు

**నంద్యాల క్రైం, అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు సిబ్బందికి ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు అనే అంశంపై సైబర్ క్రైమ్ నేరాలు నియంత్రణలో యువత పాత్ర అనే అంశాలపై నంద్యాల అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు ఆధ్వర్యంలో శుక్రవారం వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలు ప్రభుత్వ ఉపాధ్యాయుల సమక్షంలో నిర్వహించడం జరిగింది.

వీటి యొక్క ముఖ్య ఉద్దేశం సిబ్బంది యొక్క ప్రతిభను వెలికి తీసి ప్రజా శ్రేయస్సు వారి భద్రత కోసం,పోలీస్ వారు అందిస్తున్న సేవలను త్యాగా లను,దైనందిన విధులను ప్రజలకు వివరించాలని సదుద్దే శంతో మరియు ప్రస్తుత సమాజంలో సైబర్ క్రైమ్ నేరాలు జరుగుతున్న ధర్మంలో వాటిని నియంత్రించేందుకు, నేరాలు జరగకుండా అవగాహన పెంచుకొని ప్రజలకు మంచి సేవలు అందించాలని సదుద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ వ్యాస రచన, వక్తృత్వ పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా 5000 రూపాయలను రెండవ బహుమతిగా 3000 రూపాయలను మూడో బహుమతిగా 2000 రూపాయలను ఇవ్వడం జరుగుతుందని పోలీస్ అధికారులు తెలియజేశారు.

# పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవియన్స్ డే

### సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత
### జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

**నంద్యాల క్రైం, అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న 13 మంది పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రతి శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది సతమత పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియజేశారు.

## నంద్యాల జిల్లా ర్యాపిడ్, బ్లిట్జ్ చదరంగం పోటీల విజేతలకు బహుమతి ప్రధానం

### జిల్లా జట్టు ఎంపిక

**నంద్యాల అక్టోబర్ 25 ( రిపబ్లిక్ న్యూస్):**
జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో క్రాంతి నగర్ లో ఉన్న శ్రీ శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నందు నంద్యాల జిల్లా రాపిడ్ మరియు బ్లిట్జ్ విభాగాలలో నిర్వహించిన చదరంగం జట్ల ఎంపిక పోటీల విజేతలకు బహుమతి ప్రదానం చేశారు.

నంద్యాల జిల్లా చెస్ సంఘం అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్ ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు ట్రోఫీలు,పతకాలు అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ మాట్లాడుతూ గెలిచినవారు తిరిగి గెలవడం కోసం, ఓటమి చెందిన వారు తదుపరి పోటీలలో విజేతలుగా నిలవడం కోసం క్రమశిక్షణతో కూడిన నిరంతర సాధన అవసరం అన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో కూడా విజేతలుగా నిలిచి నంద్యాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింప చేయాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో నంద్యాల లయన్స్ క్లబ్ అధ్యక్షులు నిజాముద్దీన్, జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి, వైద్యులు డాక్టర్ నేట్ల మహేశ్వర రెడ్డి, పాలిటెక్నిక్ కాలేజీ అధ్యాపకులు రవి శంకర్, వ్యాయామ ఉపాధ్యాయులు ఓబులేసు, తల్లిదండ్రులు, క్రీడాకారులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు:

రాపిడ్ విభాగంలో నంద్యాలకు చెందిన




యు.హర్షవర్ధనాచారి మొదటి స్థానం,ఆళ్లగడ్డ కు చెందిన యం.యుగంధర్

రెండవ స్థానం,బ్రిడ్జి విభాగం మొదటి స్థానం నంద్యాలకు చెందిన

జి.శాలిమ్ మణి కుమార్ ,హర్షవర్ధనాచారి రెండవ స్థానం సాధించి నంద్యాల జిల్లా తరపున రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించారు

# మధుమణి ఆసుపత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



**నంద్యాల అక్టోబర్ 25( రిపబ్లిక్ న్యూస్):**
మెదుడు నుండి ముక్కుకు ఏర్పడిన రంధ్రాన్ని ఎండోస్కోపి ద్వారా, ఎటువంటి కోత, కుట్లు లేకుండా సరిచేసిన అరుదైన ఆపరేషన్ మధుమణి ఆసుపత్రిలో నిర్వహించడం జరిగింది. కడప కు చెందిన 32 సంవత్సరాల లక్ష్మీదేవి అనే మహిళా రోగి మెదడుకి ముక్కుకు మధ్యలో ఉన్న ఎముకకు రంధ్రం ఏర్పడి ఎడమవైపు ముక్కు ద్వారా మెదడులో ఉండే సి.ఎస్.ఎఫ్. అనే ద్రవం ధారగా కారుతూ, భవిష్యత్తులో మెదడుకు ఇన్ఫెక్షన్ వచ్చే ప్రమాదం ఉండడంతో శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ పరిస్థితిని సిఎస్ఎఫ్ రైనోరియా అంటారు. నగరాలలోని కార్పొరేట్ ఆసుపత్రిలో నిర్వహించే ఈ శస్త్ర చికిత్సమధుమణి నర్సింగ్ హోమ్ లో అక్టోబర్ 23వ తేదీన డాక్టర్ మధుసూదనరావు కుమారుడు యువ చెవి ముక్కు గొంతు శస్త్ర చికిత్స నిపుణుడు డాక్టర్ చిత్తలూరు మణిదీప్ విజయవంతంగా పూర్తి చేశారు. చెవి ముక్కు గొంతు వైద్యులు డాక్టర్ రోహిత్ సహకరించగా,డాక్టర్ మాధవి జనరల్ అనస్థీషియా మత్తుమందు ఇవ్వడం జరిగింది. ఖరీదైన, అత్యాధునిక లేజర్, కోబ్లేటర్, డిబ్రిడర్, ఎండోస్కోప్ వంటి పరికరాలు ఉపయోగించి శస్త్ర చికిత్స నిర్వహించారు నగరాలకు దీటుగా నంద్యాలలో చెవి ముక్కు గొంతు రంగంలో కార్పొరేట్ స్థాయిలో క్లిష్టమైన శస్త్ర చికిత్సలు నంద్యాలలో మధుమణి నర్సింగ్ హోమ్ లో తక్కువ ఖర్చుతో చేస్తున్న వైద్య బృందాన్ని ఐఎంఏ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ విజయభాస్కర రెడ్డి,నంద్యాల ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వసుధ రాణి ,డాక్టర్ పనిల్ వైద్య బృందాన్ని అభినందించారు.

## వరి పంటను పరిశీలించిన జపాన్ బృందం



**బండి ఆత్మకూరు,అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):-** మండల పరిధిలోని మణికంఠపురం గ్రామంలో జపాన్ బృందం పర్యటించింది.శుక్రవారం జపాన్ దేశానికి చెందిన జె ఎఫ్ ఈ స్టీల్ కార్పొరేషన్ (జే ఈ ఈ), భారత వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్ఆర్) సాంకేతిక బృందం సభ్యులు గురు ప్రకాష్ తివారి,కాజు మిచ్చి శశి, బి.వెంకటన్నలు క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తక్కువ పెట్టుబడితో ఐరన్ కోటెడ్ వరి పంటను పండించేందుకు ఇక్కడి వాతావరణ పరిస్థితులు అన్నికూలిస్తాయో ? లేదోనని తెలుసుకునేందుకు గ్రామానికి చెందిన ధనుంజయ రెడ్డి, శ్రీనివాసరెడ్డిలతో ఐరన్ కోటింగ్ వేసిన వరి పంటను సాగు చేయించడం జరిగిందన్నారు. ఈ పర్యటనలో భాగంగా వారు సాగుచేసిన వరిపైరును పరిశీలించడం జరిగిందని జపాన్ ప్రతినిధులు తెలిపారు.

## ఏడు మంది పేకాటరాయుల్లు అరెస్ట్

**రూ 54,800 నగదు, 4 బైకులు స్వాధీనం**

**బండి ఆత్మకూరు,అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):-** మండల పరిధిలోని నారపురెడ్డి కుంట చెంచుగూడెం దగ్గరలో పేకాట ఆడుతున్నట్లు రాబడిన సమాచారం మేరకు ఎస్సై జగన్మోహన్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు.ఈ దాడుల్లో అక్కడ పేకాట ఆడుతున్న ఏడు మందిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ 54.800 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై శుక్రవారం సాయంత్రం తెలిపారు. అంతేకాకుండా వారి వద్ద నుంచి నాలుగు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.వీరిలో లింగాపురం గ్రామానికి చెందిన నలుగురు,ఆత్మకూరు, నారాయణపురం,నారపరెడ్డి కుంట గ్రామాలకు చెందిన ఒకరు చొప్పున ఉన్నట్లు ఆయన వివరించారు.

## మహా ప్రవక్త

### మహమ్మద్ సల్లల్లాహు అలైహివ సల్లం పై మతోన్మాది నరసింహ నందు,చేసిన అనుచిత వాక్యాలకు నిరసిస్తూ ర్యాలీ..

**ఆళ్లగడ్డ అక్టోబర్ 25 రిపబ్లిక్ న్యూస్** నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలోని ఈద్గా మసీదు వద్ద నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ఆళ్లగడ్డ ముస్లిం జేఏసీ సభ్యులు మరియు ఉలమాల సంఘం నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా జేఏసీ నాయకుడు బీరువాల భాష మాట్లాడుతూ సెక్యులర్ దేశమైన భారత దేశంలో హిందూ ముస్లింలు అన్నదమ్ముల వల్ల జీవిస్తూ ఉండగా ఐకమత్యాన్ని బంగపరుస్తూ ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా మహమ్మద్ ప్రవక్త చేసిన వ్యాఖ్యలు ఎంతోమందిని బాధించాయని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారు కేవలం ముస్లింలకే కాదు పూర్తి జగత్తుకు ఆయన ప్రవక్త అని పలువురు వ్యాఖ్యానించారు అనుసద వ్యాఖ్యలకు పాల్పడి ఎంతోమందికి మనోభావాలను దెబ్బతీసిన నరసింహ నందు పై తక్షణమే చర్యలు తీసుకొని అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు అనంతరం డిఎస్పి కార్యాలయం చేరుకొని డిఎస్పీకి వినతి పత్రాన్ని సమర్పించారు.



## నీటి సంఘాల ఓటర్ల జాబితా పకడ్బందీగా చేయండి

### - తహసిల్దార్ ధోని ఆల్ఫెడ్

**బండి ఆత్మకూరు,అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):-** నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని తహసిల్దార్ ధోని ఆల్ఫెడ్,డిప్యూటీ తహసిల్దార్ గురునాథ్ లు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు విలేజి సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు.చెరువులు,కేసీ కెనాల్,తెలుగు గంగ వంటి నీటిపారుదల ఆయకట్టు రైతులను నిబంధనల మేరకు అన్ని అర్హతలు కలిగిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు.ఓటర్ల జాబితా ఎలాంటి తప్పులతడక లేకుండా తగు జాగ్రత్తలు తీసుకొని జాబితా సిద్ధం చేయాలన్నారు.ఈ సమావేశంలో మండల సర్వేయర్ పర్వీన్,వీఆర్వోలు, విలేజి సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

బండి ఆత్మకూరు,అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):- నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని తహసిల్దార్ ధోని ఆల్ఫెడ్,డిప్యూటీ తహసిల్దార్ గురునాథ్ లు రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఇందుకు సంబంధించి శుక్రవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు విలేజి సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు.చెరువులు,కేసీ కెనాల్,తెలుగు గంగ వంటి నీటిపారుదల ఆయకట్టు రైతులను నిబంధనల మేరకు అన్ని అర్హతలు కలిగిన వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు.ఓటర్ల జాబితా ఎలాంటి తప్పులతడక లేకుండా తగు జాగ్రత్తలు తీసుకొని జాబితా సిద్ధం చేయాలన్నారు.ఈ సమావేశంలో మండల సర్వేయర్ పర్వీన్,వీఆర్వోలు, విలేజి సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



## 21వ అఖిల భారత పశుగణన-2024 ఇంటింటి సర్వే పోస్టర్లను విడుదల చేసిన వేంపెంట గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ, వెటర్నరీ డాక్టర్ పి.భాస్కర్



**పాములపాడు అక్టోబర్ 25 (రిపబ్లిక్ న్యూస్):-**పాములపాడు మండలంలోని,వేంపెంట గ్రామంలో అఖిల భారత పశుగణన-2024 (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం) ఇంటింటి సర్వే పోస్టర్లను గ్రామ సర్పంచ్-వై.మాణిక్యమ్మ, వెటర్నరీ డాక్టర్- పి.భాస్కర్, రిటైర్డ్ గవర్నమెంట్ టీచర్ వై.దానమయ్య ల చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది.

ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ పి. భాస్కర్, గ్రామ సర్పంచ్ వై.మాణిక్యమ్మ లు మాట్లాడుతూ పశువులు కలిగిన మరియు పశువులు లేని ప్రతి ఇంటిని సిబ్బంది సందర్శించి వివరాలు సేకరిస్తారన్నారు. కాబట్టి ప్రతి కుటుంబ యజమాని సరైన వివరాలు అందించాలని కోరుచున్నాము అన్నారు.

ఒక ఇంటిలో ఎద్దులు, ఆవులు, గేదెలు, దున్నలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, కుక్కలు, పందులు, మరియు అన్ని రకాల పశువుల యొక్క సంఖ్య నమోదు చేయడం జరుగుతుందన్నారు.

ఈనెల 25వ తేదీ నుండి వచ్చే ఏడాది ఫిబ్రవరి-28వ తేదీ వరకు (4 నెలలు)పశుగణన జరుగుతుంది.

పశుగణన పూర్తయిన, ప్రతి ఇంటికి స్టిక్కర్స్ అతికిస్తారన్నారు.

ఎన్యుమరేటర్స్ గా పశుసంవర్ధక సహాయకులను, పశు వైద్య అధికారులను సూపర్వైజర్స్ గా నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఏ హెచ్ ఎ ప్రసన్నలక్ష్మి, చాందిని, కరిముల్లా, గోపాలమిత్ర భాస్కర్, సచివాలయ ఉద్యోగస్తులు, గ్రామ నాయకులు, తదితరులు పాల్గొనడం జరిగింది.



## నల్ల బ్యాడ్జీలతో తపాల శాఖ సిబ్బంది నిరసన విధులు




**పాణ్యం (రిపబ్లిక్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వ సంస్థ అయినటువంటి తపాలా శాఖ లో పనిచేస్తున్న సిబ్బంది గత మూడు రోజులుగా నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయం ముందు సిబ్బంది తమ నిరసన తెలియజేశారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ , ఆల్ ఇండియా గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం కేంద్ర నాయకత్వం పిలుపుమేరకు 23/10/24 నుండి 25/10/24 వ తేదీ వరకు అన్ని పోస్ట్ ఆఫీస్ లలో ప్రతి ఒక్క సభ్యుడు నల్ల బ్యాడ్జి ధరించి తమ నిరసన తెలియజేయాలని కేంద్ర నాయకత్వం పిలుపునిచ్చింది. ఈ నిరసనకు ముఖ్య కారణం ఆచరణకు సాధ్యం కానటువంటి టార్గెట్లు ఇచ్చి తపాలా ఉద్యోగులను ఉన్నతాధికారులు వేధిస్తున్నారు. ఈ వేధింపులను వెంటనే ఆ నిలిపివేయాలని కేంద్ర నాయకత్వం ఈ నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. అందులో భాగంగా పాణ్యం సబ్ పోస్ట్ ఆఫీస్ ముందు పోస్టుమాస్టర్ సుధీర్ , పోస్టుమాన్ శేఖర్ , గ్రామీణ తపాలా ఉద్యోగులు ఎస్. షాహింషా, కే. ఫయాజ్ భాష, జె .ప్రియాంక, మహిత తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గూడెల్లో మరుగు దొడ్ల లేవనే విషయం తెలీదు - ఎంపీడీవో దస్తగిరి

**బండి ఆత్మకూరు,అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):-** గిరిజన గూడేల్లో మరుగు దొడ్లు లేవనే విషయం నాకు తెలీదని నేను ఈ మధ్యనే ఇక్కడికి వచ్చానని ఎంపీడీవో దస్తగిరి తెలిపారు.శుక్రవారం ఆయన మండల పరిధిలోని నారపురెడ్డి కుంట చెంచు గూడెం సందర్శించారు. ఆయన వెంట ఈవోపిఆర్డి రామకృష్ణ వేణి,పంచాయతీ సెక్రటరీలు వెంకట రాముడు, శేష కుమారిలు ఉన్నారు. ముందుగా ఆయన నారాయణపురం గ్రామ సచివాలయంలో నిర్వహించిన ప్రత్యేక ఆధార్ క్యాంపును తనిఖీ చేశారు.తర్వాత చెంచుగూడెనికి వెళ్లి అక్కడ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన గూడెల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ఈ క్రమంలో గిరిజనులకు మరుగుదొడ్లు లేవనే విషయం రిపబ్లిక్ విలేఖరి ఎంపీడీవో దృష్టికి తీసుకురావడంతో ఆ విషయం నాకు తెలీదని ఆర్ డబ్ల్యుయస్ అధికారులను అడిగి తెలుసుకుని అవసరమైన వారందరికీ మరుగుదొడ్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడతామన్నారు.తాను పాణ్యం మండలంలో పనిచేసేటప్పుడు అక్కడి గిరిజనులందరికి మరుగుదొడ్లు మంజూరు చేశామని అక్కడ అందరు మరుగు దొడ్లు నిర్మించుకున్నారని కానీ ఇక్కడి గిరిజనులు మరుగుదొడ్లు ఎందుకు నిర్మించుకోలేదో తెలుసుకుంటానని ఆ తర్వాత వాటి నిర్మాణం కోసం తగిన చర్యలు తీసుకుంటానని ఎంపీడీవో తెలిపారు.వారి వెంట వీఆర్వో రాజు సచివాలయ సిబ్బంది రాహుల్ తదితరులు ఉన్నారు.



## రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టీమ్ కు వెలాసిటి విద్యార్థి




**నంద్యాల రూరల్, అక్టోబర్ 25, రిపబ్లిక్ న్యూస్ :** నంద్యాల పట్టణంలోని స్థానిక బొమ్మల సత్రం నందుగల నంది పైప్స్ బ్యాడ్మింట్టన్ అకాడమీ

నందు ఎస్ జి ఎఫ్ వారు సెప్టెంబర్ 24వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టీమ్ సెలక్షన్స్ కు వెలాసిటీ జూనియర్ కాలేజ్ విద్యార్థి ఎస్. షాహిద్ పాల్గొని రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టీమ్ కు ఎంపిక కావడం జరిగింది . ఈ సందర్భంగా కళాశాల లో ఏర్పాటు చేసిన అభినందన సభ లో కళాశాల ప్రిన్సిపాల్ మాధవీ లత మాట్లాడుతూ.. చదువుతోపాటుగా ఆటల్లో రాణించటానికి విద్యార్థులకు తగిన ప్రోత్సాహాన్ని కళాశాల ఎల్లప్పుడూ అందిస్తుందని , విద్యార్థులు వారి నైపుణ్యాలను మెరుగుపరుచుకుని రాష్ట్ర, జాతీయస్థాయిలో పాల్గొని మంచి పురోగతిని సాధించాలని కోరారు .

ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరావు , వైస్ ప్రిన్సిపల్ వంశీ చైతన్య, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్

గురుమోహన్ మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## అవోపా ఆధ్వర్యంలో సిమెంట్ బెంచీల పంపిణీ




**అళ్లగడ్డ అక్టోబర్ 25 రిపబ్లిక్ న్యూస్** ఆళ్లగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో 8000 రూపాయలు విలువ చేసే రెండు సిమెంట్ బెంచీలను అవోపా సభ్యురాలు సుధారాణి శుక్రవారం అందజేశారు. అఓప సేవా నిధికి ఆమె 50 వేల రూపాయలు అందజేసి వచ్చే వడ్డీతో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ జన్మదినం సందర్భంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్న సుధారాణిని అభినందించారు.

## పెసరవాయి ఫ్యాక్షన్ పికెట్ ఆకస్మిక తనిఖీ... గ్రామస్తులతో అవగాహన

**ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ పార్థసారధి**



**నంద్యాల క్రైం, అక్టోబర్ 25, (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల సబ్ డివిజన్ గడివేముల పోలీస్ స్టేషన్ పరిధిలోని పెసరవాయి పోలీసు ఫ్యాక్షన్ పికెట్ ను ఆకస్మిక తనిఖీ చేసి గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం ఫ్యాక్షన్ జోన్ ఇన్స్పెక్టర్ పార్థసారథి ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ పెసరవాయి గ్రామంలోని పరిస్థితులపై సిబ్బంది అడిగి తెలుసుకుని నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామంలోకి వచ్చిన వారిపై నిఘా ఉంచాలని ,గ్రామంలో అల్లర్లు గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉంటూ ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు అధికారులకు సమాచారం అందించాలని తెలియజేశారు. అనంతరం పెసర వాయి గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామంలో అందరూ ఐక్యమత్యంతో ఉండాలని, నేర నియంత్రణకు పోలీసులు తీసుకునే చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, గొడవలకు అల్లర్లకు దూరంగా ఉండాలని, ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు వెంటనే పోలీసు వారిని ఆశ్రయించాలని తక్షణమే మీకు రక్షణ కల్పిస్తారని, కావున ప్రజలందరూ చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని తెలియజేస్తూ అందరూ శాంతియుతంగా జీవనం సాగిస్తూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.



# జైన్ పరిశ్రమ ప్రారంభానికి సహకరిస్తాం.

### జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.

**జూపాడుబంగ్లా/నంద్యాల, అక్టోబర్ 25, రిపబ్లిక్ న్యూస్ ::** జైన్ పరిశ్రమ త్వరలో ప్రారంభించేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకరిస్తుందని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం జూపాడుబంగ్లా మండలం తంగడంచలోని జైన్ ఇరిగేషన్ సిస్టం లిమిటెడ్ పరిశ్రమ పరిసరాలను నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయసూర్య తో కలిసి పరిశీలించారు. జైన్ పరిశ్రమ అధికారులు తంగడంచ నుంచి ప్రస్తుతం నిర్వహిస్తున్న కార్యకలాపాల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల నుంచి జైన్ పరిశ్రమకు అన్ని విధాల సహకరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రధానంగా తమిళనాడు, కేరళ రాష్ట్రం తరహాలో అరటి పంట కోత దశలో రైతులకు వ్యయం తగ్గించేందుకు రోప్ వే తరహా పద్ధతిని రాయలసీమ జిల్లాల్లో కూడా తీసుకురావాలని జైన్ అధికారులను కలెక్టర్ సూచించారు. వీలైనంత త్వరగా అరటి, బొప్పాయి తదితర పండ్ల మొక్కలను తంగడంచ నుంచి సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని జైన్ అధికారులను ఆదేశించారు. తంగడంచ ఫామ్ లో ఉన్న 1600 ఎకరాల్లో విత్తనోత్పత్తి ఏ విధంగా తీసుకురావాలన్న అంశాలపై వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులతో చర్చించి ముందుకు వెళ్తామన్నారు. నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జయ సూర్య మాట్లాడుతూ జైన్ పరిశ్రమ గత పాలకుల మూలంగా ముందుకు వెళ్లలేకపోయిందని ప్రస్తుతం ప్రభుత్వ హయాంలోనైనా జైన్ పరిశ్రమ ప్రారంభమయ్యేందుకు చర్యలు గైకొనాలని జిల్లా కలెక్టర్ ను విజ్ఞప్తి చేశారు. జైన్ పరిశ్రమలో 100% స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలని జైన్ అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ ఎం దాసు, ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, జైన్ పరిశ్రమ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్ బాబు, తంగడంచ ఇంచార్జ్ మహేంద్ర బాబు, లైజనింగ్ అధికారి మౌలాలి, జూపాడుబంగ్లా తహసిల్దార్ తదితరులు పాల్గొన్నారు.

## జూపాడుబంగ్లాలోని, తంగడంచ సీడ్ హబ్ ను పరిశీలించిన నంద్యాల జిల్లా కలెక్టర్







### - జి.రాజకుమారి గణియా

### ఎమ్మెల్యే గిత్త.జయసూర్య

**జూపాడు బంగ్లా అక్టోబర్-25 (రిపబ్లిక్ న్యూస్):-** జూపాడుబంగ్లా మండలంలోని, తంగడంచ సీడ్ హబ్ ను నంద్యాల జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణీయా తో కలిసి నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త.జయసూర్య లు పరిశీలించారు. ఈ జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా, ఎమ్మెల్యే గిత్త.జయసూర్య లు మాట్లాడుతూ ఈ సీడ్ హబ్ లో రైతులకు సంబంధించిన నాణ్యమైన విత్తనాలు తయారు చేయడం జరుగుతుందన్నారు. ప్రక్కన జైన్ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు అవుతున్న ఫుడ్ పార్కులో కూడా బ్రిటానియా, క్యాడ్బరీ వంటి 16 రకాల కంపెనీలు ఇక్కడ ఏర్పాటు అవుతున్నాయన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయి ప్రజలకు అంకితమైతే దాదాపు 6000 ఉద్యోగాలు నిరుద్యోగుల వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో- ఎం. దాసు, జుపాడు బంగ్లా తహసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, ఎంపీడీవో డి. గోపికృష్ణ, పోలీస్ సిబ్బంది, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ నాయకులు మాండ్ర. సురేంద్ర నాథ్ రెడ్డి, మండల కన్వీనర్లు వెంకటేశ్వర్లు, పలచానీ. మహేశ్వర్ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి సిఏ. మద్దిలేటి, సోషల్ మీడియా ప్రతినిధి పసుల.శ్రీనివాసులు నాయుడు, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఈ దీపావళి నుంచే ఉచిత గ్యాస్ సిలిండర్లు... విధివిధానాలు వెల్లడించిన మంత్రి నాదెండ్ల

ఈ నెల 31 న రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, తదుపరి వెంటనే ప్రతి ఇంటికీ మొదటి గ్యాస్ సిలిండర్ డెలివరీ చేయడం జరుగుతుందన్నారు. ఎల్.పి.జి.కనెక్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు అర్హతగా ఈ పథకం అమలు చేస్తున్నట్లు మంత్రి నాదెండ్ల తెలిపారు.

రాష్ట్రంలో 1.55 కోట్ల గ్యాస్ కనెక్షన్లు, 1.47 రేషన్ కార్డులు ఉన్నాయని, వీరిలో అర్హులు అందరికీ ఈ పథకం వర్తింపచేయడం జరుగుతుందన్నారు. ఈ పథకం అమలుకై ప్రతి ఏడాది ప్రభుత్వం పై రూ.2,684.75 కోట్ల మేర భారం పడుతుందన్నారు. ఎన్నో ఆర్థిక ఇబ్బందులను రాష్ట్ర ప్రభుత్వం ఎదుర్కుంటున్నా సరే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళల భద్రతను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు.

**విధివిధానాలు...**

ఈ పథకం అమల్లో భాగంగా ఈ నెల 29 నుంచి గ్యాస్ బుకింగ్స్ ప్రారంభిస్తారు. గ్యాస్ బుకింగ్ చేసుకోగానే ఒక ఎస్.ఎం.ఎస్. సంబంధిత లబ్ధిదారుని ఫోన్ నెంబరుకు వెళుతుంది.

పట్టణ ప్రాంతాల్లో అయితే గ్యాస్ బుక్ చేసుకున్న 24 గంటల్లో, గ్రామీణ ప్రాంతాల్లో అయితే గ్యాస్ బుక్ చేసుకున్న 48 గంటల్లో సిలిండ్లను డెలివరీ చేస్తారు.

అదే విధంగా, గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసిన 48 గంటల్లోనే డి.బి.టి. విధానం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా రాయితీ సొమ్ము జమ చేస్తారు. ప్రభుత్వం అందజేసే మూడు ఉచిత సిలిండర్లలో మొదటి సిలిండర్ మార్చి 31 లోపు, రెండోది జూలై 31 లోపు, మూడోది నవంబరు 30 లోపు ఎప్పుడైనా పొందవచ్చు.

ఈ పథకం అమలుకై ఏడాదిని మూడు బ్లాక్ పీరియడ్లు పరిగణిస్తారు. మొదటి బ్లాక్ పీరియడ్ ఏప్రిల్ 1 నుండి జూలై 31 వరకు, రెండో బ్లాక్ పీరియడ్ ను ఆగస్టు 1 నుండి నవంబరు 31 వరకు మరియు మూడో బ్లాక్ పీరియడ్ ను డిసెంబరు 1 నుండి మార్చి 31 వరకు పరిగణిస్తారు.

ఈ పథకం అమల్లో లబ్ధిదారులకు సమస్యలు ఎదురైతే టోల్ ఫ్రీ నెం.1967 కు ఫోన్ చేసి ఫిర్యాదులను నమోదు చేసుకోవచ్చు.

కాగా, ఈ పథకం అమలుకు సంబంధించి ఇప్పటికే మూడు ఆయిల్ కంపెనీలతో మాట్లాడం జరిగిందని, ఆయిల్ కంపెనీల వద్ద మరియు ప్రభుత్వం వద్ద ఉన్న డేటాను సమన్వయం చేసుకుంటూ ఈ పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని మంత్రి నాదెండ్ల పేర్కొన్నారు. ఈ పథకం అమలుకై ఆయిల్ కంపెనీలకు అడ్వాన్సుగా రూ.894.92 కోట్లను ఈ నెల 29న చెక్కు రూపేణా చెల్లించడం జరుగుతుందన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ పనులు

**ఒంగోలు కలెక్టరేట్, అక్టోబరు 25 :** జిల్లాలో అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేసి నీటి సంరక్షణ పనులను పెద్దఎత్తున చేపట్టాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రకాశం భవన్లో నీటి సంరక్షణ పనులపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. నీటి సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉన్నదన్నారు. జిల్లాలోని 57 గ్రామాల్లో పరిమితికి మించి భూగర్భ జలాలను వినియోగించినట్లు గుర్తించామన్నారు. వీటిలోని పలు గ్రామాలపై కొన్ని సంస్థలు ఇప్పటికే అధ్యయనం చేసి వాటర్ బడ్జెట్ ప్రణాళికను రూపొందించాయన్నారు. అదేతరహాలో జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఎంత నీరు అందుబాటులో ఉంది? ఎంత వినియోగిస్తున్నారు? ఇంకా నీటి అవసరం ఎంత ఉంది? తదితర విషయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి విలేజ్ వాటర్ బడ్జెట్ ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అందులో గ్రామస్థులను భాగస్వామ్యం చేసి వారి సూచనలు, సలహాలు తీసుకోవాలన్నారు. ఇంకుడు గుంతలు, రూఫ్ టాప్ వాటర్ హార్వెస్టింగ్, ఫారం పాండ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. నీటి సంరక్షణ కార్యక్రమాల అమలులో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలో 33వేల ఇంకుడు గుంతల నిర్మాణాలకు అనుమతిచ్చినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా చెప్పారు. మండలానికి వెయ్యి నిర్మించేలా లక్ష్యాన్ని నిర్దేశించడంతోపాటు జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో ఒకే రోజున నమూనా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టి దాని వలన ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. నీటి సంరక్షణ కార్యక్రమాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులను కూడా భాగస్వాములను చేయాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు విద్యాసాగర్, చిరంజీవి, శ్రీనివాసరావు, వసుంధర, రవికుమార్, వెంకటేశ్వరరావుతోపాటు పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



## అందరూ చూడదగ్గ సినిమా రంగస్వామి సినిమా : ఎన్ఎండి ఫిరోజ్

### ఆదివారం పాత్రికేయులకు ఉచిత ప్రదర్శన



**నంద్యాల అక్టోబర్ 25 (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోనిఅభిరామ్ థియేటర్లో శుక్రవారం రిలీజ్ అయినటువంటి రంగస్వామి సినిమాను అందరూ చూడదగ్గ సినిమా అని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల ప్రేక్షకులు ఈ సినిమాను వీక్షించి ఇటువంటి సినిమాలు సమాజానికి ఎంతో అవసరమని , తల్లిదండ్రులు పిల్లలని ప్రేమతో పాటు బాధ్యతతో కూడా వారి భవిష్యత్తులో ఎటువంటి చెడు అలవాట్లకు లోను కాకుండా ఉండే విధంగా ఎదగాలని దర్శకులు నరసింహ చారి రంగస్వామి సినిమా లో చాలా చక్కగా చిత్రీకరించారు అని ,అందరూ కుటుంబ సమేతంగా చూడదగ్గ సినిమా అని కొనియాడడం జరిగింది. భవిష్యత్తులో ఇలాంటి సినిమాలు యువతకు ఎంతో అవసరమని రాయలసీమ నుంచి ఇలాంటి సినిమాలు మరిన్ని రావాలని కూడా వారు ఆశించారు. అనంతరం నిమ్మకాయల సుధాకర్ , ఖండే శ్యాంసుందర్ , ఈ సినిమాలో ప్రధాన పాత్రధారి డాక్టర్ మారుతి సకారాం , పాటల రచయిత ఉసిరికాయల వెంకటేష్ , ఇందులో నటించినటువంటి తారాగణం, ఐలుక్ యాడ్స్ సీఎండీ శ్రీనివాస్ నాయుడు, రాజేష్ రామంజి మహేంద్ర లతోపాటు సినిమాను వీక్షించారు

ఆదివారం పాత్రికేయులకు ఉచిత ప్రదర్శన

ఆదివారం ఉదయం



11 గంటలకు పాత్రికేయుల కొరకు రంగస్వామి చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నట్లు రంగస్వామి పాత్ర పోషించిన నటుడు మారుతీ సకారం తెలిపారు. రంగస్వామి సినిమాను చూసిన అనంతరం పాత్రికేయులు సినిమాలోని మంచిని పదిమందికి చెప్పి ప్రోత్సహించాలని కోరారు. సినిమాలోని లోపాలను విమర్శించాలని తమ విలువైన అభిప్రాయాలను ప్రజలకు పాత్రికేయులు అందించాలని పిలుపునిచ్చారు

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com